# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 97 | విశాఖపట్నం | 6-1-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 97 | VISAKHAPATNAM | 6-1-2026 TUESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram







## తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషం కాదు

# సమైఖ్యత అవసరం: చంద్రబాబు

**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరులో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం గోదావరి జలాల గురించి మాట్లాడారు. తెలుగువాళ్లు కలిసుంటే ఎన్నో సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో ఉమ్మడి ఏపీలో పలు ప్రాజెక్టులు కట్టినట్లు వివరించారు. చంద్రబాబు నాయుడు హయాంలో తెలంగాణలో కల్వకుర్తి, ఏఎంఆర్, నెట్టెంపాడు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. భీమా ఎత్తిపోతల కూడా చంద్రబాబు హయాంలోనే పూర్తయిందని అన్నారు. గోదావరిపైనా ఉమ్మడి ఏపీలో అనేక ప్రాజెక్టులు కట్టామని, గతేడాది కృష్ణా, గోదావరి నుంచి 6 వేల టీఎంసీలు సముద్రంలోకి వెళ్లాయన్నారు. గోదావరి నీళ్లు వాడుకుంటే నేను ఎప్పుడూ అడ్డుచెప్పలేదన్నారు. విభజన తర్వాత కాళేశ్వరం కట్టినా గోదావరిలో చాలా నీళ్లున్నాయని అభ్యంతరం చెప్పలేదని సీఎం తెలిపారు. గోదావరిపై ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఫర్వాలేదని, రాష్ట్రానికి నీళ్లు వస్తాయని అనుకున్నానని సీఎం తెలిపారు. గడచిన 40 ఏళ్లుగా 3



వేల టీఎంసీలు గోదావరి నుంచి సముద్రంలోకి పోతున్నాయన్నారు. త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం జరుగుతుంది. ప్రపంచంలో తక్కువ నీటి వినియోగం చేసే దేశం మన భారతదేశమే. ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా గంగా, కావేరి కలవాలి దేశంలో నీటి సమస్య పరిష్కారం కావాలి. ఏపీలో ఉండే నదులన్నీ అనుసంధానం కావాలి. తెలంగాణలో గోదావరి నీళ్లు కూడా వాడుకోవాల్సిన అవసరం ఉంటే వాడుకోవాలి. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు, సమైఖ్యత అవసరమని చంద్రబాబు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఒకరినొకరు అర్థం చేసుకుని కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. ఎంతోమంది త్యాగాలు చేశారని, ఇది రాజకీయ వేదిక కాదని నీటి విషయంలో, సహకారంలో తెలుగువారంతా కలిసి ఉండాలని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మనల్ని గుర్తించే ఏకైక భాష తెలుగు భాష అని సీఎం కొనియాడారు. మరోవైపు రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఈ నెల 7న పోలవరం పర్యటనకు వెళ్లనున్నారు.

## మళ్లీ ఓఎన్జీసీ గ్యాస్ లీక్

# భయాందోళనలో కోనసీమ..!



**కోనసీమ, పతాకం న్యూస్:** కోనసీమ జిల్లాలో ఓఎన్‌ఏసీ పైప్ లైన్ నుంచి భారీగా గ్యాస్ లీక్ అవుతుండటంతో అక్కడి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మలికిపురం మండలం ఇరుసమండ వద్ద ఉత్పత్తిలో ఉన్న బావి ఆగిపోవడంతో వర్క్ అవర్ రిగ్గుతో పనులు చేస్తుండగా ఒక్కసారిగా భారీ ఎత్తున క్రూడ్ తో కూడిన గ్యాస్ ఎగసిపడింది. గ్రామంలోకి పొగ మంచు మాదిరి గ్యాస్ కమ్మేసింది. దీంతో కోనసీమ ప్రజలంతా భయాందోళన చెందారు. వెంటనే ఓఎన్జీసీ అధికారులకు గ్రామస్తులు సమాచారమిచ్చారు. పైప్ లైన్ నుంచి భారీగా గ్యాస్ లీక్ అవుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ పదే పదే గ్యాస్ లీక్ అవుతున్న సందర్భాలను గుర్తు చేసుకుని ఆవేదన చెందుతున్నారు. ఇది మరొక బ్లో అవుట్‌కు దారితీస్తుందేమోనని కోనసీమ వాసులు భయం గుప్పెట్లో బతుకుతున్నారు. గతంలో పాశర్లపూడి వద్ద చోటు చేసుకున్న ఘటనను తలుచుకుంటున్నారు.





పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## తరిగిపోతున్న రైతు సహకార సంఘాలు

ఉమ్మడి రాష్ట్రంలో 12 వేల సహకార సంఘాలు, 27 జిల్లా బ్యాంకులు ఉండేవి. 1973లో వయబిలిటీ ప్రోగ్రాం ద్వారా నష్టాల్లో ఉన్న 6000 సంఘాలను రద్దు చేశారు. ఇక 1984లో ఎన్.టి.రామారావు తీసుకొచ్చిన సింగిల్ విండో సిస్టమ్ వల్ల 6000 నుంచి 4610 సంఘాలకు కుదించారు. జిల్లాల సెంట్రల్ బ్యాంకులను 23కు విలీనం చేశారు. అంటే సంఘాలు తరిగిపోయాయి. ఇంకా తరిగిపోతున్నాయి. బ్యాంకులు మాత్రం అదే విధంగా కొనసాగుతున్నాయి. ఇది ఎందుకు జరిగింది? నాబార్డు అధికారులు ప్రత్యేకంగా కమిటీల ద్వారా ఇచ్చిన సిఫారసులను చూస్తే, అసలు విషయాన్ని దాచిపెట్టి సంఘాలు నష్టాల్లో ఉన్నాయి కనుక రద్దు కాబడుతున్నాయని నమ్మబలుకుతున్నారు. ఇందుకు కారణం కమిటీలలో మెజారిటీ భాగం బ్యాంకు అధికారులే ఉండటం గమనించదగ్గ విషయం. అసలు నష్టాలకు కారణం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దాన్ని తొక్కిపెట్టి మిగిలిన రాజకీయ కారణాలను తెర మీదకి తీసుకొచ్చారు. మొదటి నుంచి మనం చెబుతున్నది, కనిపిస్తున్నది ఒకటే. అది అకౌంటింగ్ సిస్టమ్. ఇది సరిగా లేనందువల్ల వచ్చిన వడ్డీ అంతా బ్యాంకు వారు తమ అప్పుల ఖాతాకు జమ చేసుకోవడం వలన సంఘాలు ఇన్‌బ్యాలెన్స్‌కి చేరుకుని నష్టాలపాలవుతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించే ప్రయత్నమే చేయడం లేదు. కాగా సంఘాల్లో సిబ్బంది అధికంగా ఉన్నారని, జీతాలు ఎక్కువ తీసుకుంటున్నారని, ఇవి నాబార్డు నిబంధనలకు లోబడి లేవని కుంటి సాకులు చెబుతూ సహకార ఉద్యమానికి తూట్లు పొడుస్తున్నారు. వైద్యనాథన్ సిఫారసులకు ముందే ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 4,610 సంఘాలను 2795 సంఘాలుగా కుదించారు. దరిమిలా వైద్యనాథన్ ప్యాకేజ్ ద్వారా 1850 కోట్ల రూపాయల నిధులు సహకార సంఘాలు ఇవ్వడం జరిగింది. ఈ మొత్తం అంతా సహకార సంఘాల బాకీలను డిసిసిబిలు జమ చేసుకొని మిగిలిన మొత్తాన్ని ఫ్లెక్సీ డిపాజిట్లుగా బ్యాంకుల్లో మదుపు చేసుకున్నారు. ఆ మొత్తం నుంచి సంఘాలు వ్యాపారం చేసుకోవడానికి ఇమ్మని అడిగితేమీరు బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు ఇవ్వండి, మీకు మంజూరు చేస్తాం అని డిసిసిబి నుండి ఆప్కాబు వరకు ఒకే పాట పాడేవారు. కానీ స్టేట్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (ఎస్.ఎల్.ఐ.సి) వారు మాత్రం ఒక తీర్మానం చేసుకుని ఆ తీర్మానం ద్వారా ఫ్లెక్సీ డిపాజిట్‌లో ఉన్న సొమ్మును బ్యాంకులకు దఫదఫాలుగా మొత్తం జమ చేసుకున్నారు. ఆ మొత్తం సొమ్మును వారి సిబ్బంది జీతాలకే వాడుకున్నారు. గట్టిగా అడిగిన అధ్యక్షులు లేకపోవడం వలన మొత్తం ఫ్లెక్సీ డిపాజిట్లు బ్యాంకుల పరం అయిపోయాయి. రీఫైనాన్సు సదుపాయం లేకుండా పోయిన పరిస్థితి నుండివైద్యనాథన్ ప్యాకేజీ 1850 కోట్ల రూపాయల వల్ల 11 సెంట్రల్ బ్యాంకులు మామూలు స్థితికి వచ్చాయి. దరిమలా రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏపీకి 13 జిల్లా బ్యాంకులు 2051 సహకార సంఘాలు ఉన్నాయి. నేటి తాజా పరిస్థితి చూస్తే 2051 సహకార సంఘాలకు కేవలం వందల సంఖ్యలో మాత్రమే సంఘాలు నిలదొక్కుకున్నాయి. మిగిలినవి నష్టాలబాటలో ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి. ఇందులో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం విడుదల చేసిన జీవోల ప్రకారం వేతనాలు ఇవ్వడానికి బ్యాంకులు అడ్డంకి చెబుతున్నాయి. జీవో జారీ చేసి 6 సంవత్సరాలు గడిచినప్పటికి బ్యాంకులు డి.ఎల్.ఎస్.ఎఫ్ ను ఈనాటికీ ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలుపరచడానికి ముందుకు రావడం లేదు. ఉద్యోగులు జీవో అమలు కోసం సంవత్సరాల తరబడి ఆందోళన చేస్తూనే ఉన్నారు. 1964 చట్టం ప్రకారం సహకార రంగంలోని మూడంచెలు సెక్షన్116కు లోబడి సిబ్బంది నియామకాలు, వేతనాలు వగైరా సర్వీసు నిబంధనలు వుంటాయి. బ్యాంకులకు లేని ఆంక్షలను సంఘాలకు పెట్టి నష్టాల ఊబిలోకి ఎందుకు నెడుతున్నారు? ఇప్పటికి 13 జిల్లా బ్యాంకుల్లో మూడు జిల్లా బ్యాంకులు మాత్రమే పరవాలేదనేలా ఉన్నాయి. మిగిలిన 10 జిల్లాల బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ లైసెన్స్ రద్దుకు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ, వాటికి ప్రభుత్వం మద్దతు ఇస్తున్నది. ఇది సరైన విధానం కాదు. బ్యాంకులతో సమానంగా సహకార సంఘాలను కూడా పరిగణించాలి. సహకార సంఘాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. అలాగే ఆ సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన జీవోలు అమలుపరిచి 2019, 2024 వేతన సవరణ పూర్తిచేసి, మెరుగైన గ్రాట్యుటీ విధానాన్ని అమలు చేయాలి.

## కోనసీమలో ఓఎన్జీసీ సైట్ వద్ద భారీ అగ్నిప్రమాదం... మంత్రులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** కోనసీమ జిల్లాలో తీవ్ర ఆందోళన నెలకొంది. మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్‌లో భారీ గ్యాస్ లీకేజీ జరిగి, పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సోమవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓఎన్జీసీకి చెందిన మోరీ–5 బావి వద్ద ఉన్న గ్యాస్ పైప్‌లైన్ నుంచి ఒక్కసారిగా గ్యాస్ పైకి చిమ్మడంతో మంటలు వ్యాపించాయి. దాదాపు రెండు గంటల పాటు పెద్ద శబ్దాలతో గ్యాస్ లీక్ అవడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో సమీపంలోని కొబ్బరి తోటలకు మంటలు అంటుకొని, 500కు పైగా చెట్లు కాలిపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. చుట్టుపక్కల 5 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓఎన్జీసీ ఉన్నతాధికారులు, సాంకేతిక బృందాలు రాజమండ్రి నుంచి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షంచారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని సీఎం ఆదేశించారు. మంటలను త్వరితగతిన అదుపు చేసేందుకు ఓఎన్జీసీతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఘటనపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కోరారు. కాగా, ఉత్పత్తిని పెంచే పనుల్లో భాగంగానే ఈ లీకేజీ జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్:** బుచ్చయ్యపేట ఎస్సై ఏ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ సిబ్బంది బుచ్చయ్యపేట గ్రామ శివారు చెరుకు కాటా వద్ద ఒరిస్సా నుండి 3 కేజీల గంజాయి కలిగిన ఒక తెల్లటి మూటను అనకాపల్లి గవరపాలెంనికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పోలీస్ పట్టుకున్నారు. గంజాయి ని స్వాధీనం చేసుకొని వారి పై గంజాయి కేసు నమోదు చేసి, చోడవరం కోర్ట్ కు రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

## పనసలపాడు రెవిన్యూ పరిధిలో పట్టాల పంపిణీ చేయాలి: గిరిజనుల డిమాండ్



**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం పనసలపాడు రెవిన్యూ పరిధిలో పనసలపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు పెట్టి పట్టాలను పంపిణీ చేయాలని పనసలపాడు గిరిజనులు ఎమ్మార్వో కి వినతి పత్రం అందజే శారు. రత్నంపేట సచివాలయంలో పనసలపాడు రెవిన్యూ సదస్సు పెట్టి పట్టాల పంపిణీ కార్యక్రమం చేస్తామన్నారు.దీనివల్ల మాకు ఆ గ్రామానికి చాలా దూరం. మా రెవిన్యూ గ్రామంలో పట్టాల పంపిణీ చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై గత జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయగా అప్పటి డిప్యూటీ తాసిల్దార్ ఆధ్వర్యంలో మా గ్రామంలో రెవిన్యూ సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో_విపిఎస్ జిల్లా కార్యదర్శి ఈ చిరంజీవి, గ్రామస్తులు గేమిల చందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మరో 17 మంది మావోయిస్టులు మాత్రమే ఉన్నారు: డీజీపీ

**హైదరాబాద్, పతాకం న్యూస్:** రాష్ట్రానికి చెందిన మరో 17 మంది మావోయిస్టులు లొంగిపోతే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా నిలుస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన వారు 17 మంది మాత్రమే ఉన్నారని ఆయన వెల్లడించారు. వారిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్ గ్రౌండ్‌లో ఇద్దరు ఉన్నారని తెలిపారు. వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారని ఆయన అన్నారు. ఈ 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.25 కోట్ల రివార్డు ఉందని ఆయన చెప్పారు. వారంతా లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. ఆపరేషన్ కగార్ గడువు లోపే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిస్తే పోలీసు శాఖ నుంచి వారికి అవసరమైన సహాయం అందుతుందని ఆయన అన్నారు.

## పిన్నమనేని కుటుంబానికి అండగా నిలుస్తాం: చంద్రబాబు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటీవల గుండెపోటుతో కన్నుమూసిన సికింద్రాబాద్ టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా కుటుంబ సభ్యులను పరామర్శించారు. విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... విమానాశ్రయం నుంచి నేరుగా సికింద్రాబాద్ లోని సాయిబాబా నివాసానికి వెళ్లారు. సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారి సాయిబాబా స్వాగతం పలికేవారని గుర్తుచేసుకున్నారు. చివరి శ్వాస వరకు పార్టీకి విధేయుడిగా పనిచేసిన గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా సాయిబాబా చేసిన సేవలను ఆయన కొనియాడారు. సాయిబాబా కుటుంబం సమస్యల్లో ఉందని తెలిసిందని, వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పరామర్శ అనంతరం తిరిగి వెళుతుండగా, మీడియా ప్రతినిధులు తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న కృష్ణా జలాల వివాదంపై సీఎంను ప్రశ్నించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, త్వరలోనే అన్ని విషయాలు చెబుతానుఁ అని క్లుప్తంగా సమాధానమిచ్చారు. ఇరు రాష్ట్రాల మధ్య నీటి వివాదం తీవ్రంగా ఉన్న తరుణంలో చంద్రబాబు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## రాయలసీమకు ద్రోహం చేసిందే జగన్: అచ్చెన్నాయుడు




**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు మంత్రి అచ్చెన్నాయుడు రాయలసీమకు ద్రోహం చేసిందే జగన్ అని ధ్వజమెత్తారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వైసీపీ నేతల విమర్శలకు ధీటుగా ఏపీ మంత్రులు సమాధానం ఇచ్చారు. వైసీపీ, సాక్ష మీడియా చేస్తోన్న తప్పుడు ప్రచారంపై దుయ్యబట్టారు. జగన్ హయాంలోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆగిపోయిందని స్పష్టం చేశారు అచ్చెన్నాయుడు. 2020లోనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆగిపోయిందని తేల్చిచెప్పారు. వైసీపీ హయాంలోనే ఎవరో ఎన్జీటీకి వెళ్తే స్టే ఇచ్చిందని ప్రశ్నించారు. ఈరోజు తాము ఆపామంటూ వైసీపీ నేతలు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఎవరి స్వార్థం కోసం వారు మాట్లాడుకుంటున్నారని విమర్శలు చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వాస్తవాలను ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగినట్లుగా ఒక్క ఆధారమైన చూపించాలని సవాల్ విసిరారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో తమకు ఉన్న రిలేషన్ వేరని, ఏపీ ప్రయోజనాలు వేరని క్లారిటీ ఇచ్చారు. రిలేషన్ కోసం ఏపీ ప్రయోజనాలను తాము ఎప్పుడూ పణంగా పెట్టమని స్పష్టం చేశారు అచ్చెన్నాయుడు. రాయలసీమ ద్రోహి ఎవరనే విషయం ప్రజలంతా తెలుసుకున్నారని ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. జగన్ రాయలసీమకు చేసిన ద్రోహం గురించి ప్రజలు తెలుసుకునే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని వ్యాఖ్యానించారు. జగన్ రాయలసీమ వాసులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. జగన్ రాయలసీమకు అన్యాయం చేయడంతోనే కూటమికి అక్కడ ఎక్కువగా సీట్లు వచ్చాయని తెలిపారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఊహించని విధంగా ధాన్యం కొనుగోళ్లు... ఇది ఓ చరిత్ర: మంత్రి నాదెండ్ల



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఎవరూ ఊహించని విధంగా ఈరోజు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అన్నది ఓ చరిత్ర అని చెప్పుకొచ్చారు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటిది ఏనాడూ జరగలేదని తెలిపారు. ఈరోజు వరకు రాష్ట్ర వ్యాప్తంగా 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ఈ ఖరీఫ్‌లో 9 వేల 300 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో 24 గంటల్లోపే జమచేశామని చెప్పారు. ఇది ఎవరు ఊహించిన విధంగా చేశామని మంత్రి అన్నారు. క్షత్రస్థాయిలో రైతులకు ఒక భద్రత ఒక నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం కలిగించిందన్నారు. రైతులు ధైర్యంగా ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్ముకోగలం అనే నమ్మకాన్ని కూటమి ప్రభుత్వంలో కల్పించామని తెలిపారు. రైస్ మిల్లర్స్ ఎవరైనా పొరపాట్లు చేస్తే ఖచ్చితంగా వారి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఎప్పుడైనా ఆరు నెలలలోపు రైతాంగానికి డబ్బులు వేశారా అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేసి బకాయిలు వదిలేసి వెళ్ళిపోయేవారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి చేసిన బకాయిలు 16 వందల 74 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం వచ్చాక రైతాంగానికి బకాయిలు తీర్చిందని తెలిపారు.

# గోమాంగి రోడ్డు నిర్మాణానికి అరకు ఎంపీ గుమ్మా తనూజ రాణి హామీ



**పెదబయలు, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని గోమాంగి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజ రాణి హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా రోడ్డు సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు ఎంపీని కలిసి వినతి పత్రం సమర్పించారు. గోమాంగి గ్రామస్థులు సోమవారం మర్యాదపూర్వకంగా అరకు ఎంపీ డా. గుమ్మా తనూజ రాణి ని కలిశారు. రోడ్డు సదుపాయం లేకపోవడంతో వైద్యం, విద్య, రవాణా వంటి మౌలిక అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వివరించారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించిన ఎంపీ గుమ్మా తనూజ రాణి త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. రోడ్డు సమస్య త్వరలో పరిష్కారమవుతుందన్న ఎంపీ హామీతో గోమాంగి గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చెట్టి వినయ్, జెడ్పీటీసీ బొంజుబాబు, సర్పంచ్ సురేష్, బాలరాజు, విజయ్, లక్ష్మణ్, సీతారామ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఆశాజనకంగా రబీ




**అనకాపల్లి, పతాకం న్యూస్:** ప్రస్తుత రబీ సీజన్ అపరాలు, గంటి, నువ్వులు, తదితర పంటలకు మంచి అనుకూలంగా ఉందని, వైఎల్ఎం146 వంటి నువ్వు విత్తనాలు వేసేందుకు అనువైన వాతావరణం ఉందని వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఖరీఫ్‌లో 7 శాతం అధిక వర్షపాతం వల్ల వరి విస్తీర్ణం 21 శాతం పెరిగిందని తెలిపారు. రైతులు వరిలో సగటున 30 నుంచి 35 బస్తాల దిగుబడి సాధించారని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి ఎం.ఆశాదేవి మాట్లాడుతూ ఖరీఫ్‌లో చీడపీడల బెడద తగ్గినందున పురుగు మందుల వినియోగం కూడా తగ్గిందన్నారు. కొత్త వరి రకాలైన ఆర్‌జీఎల్ 7034, 7039, 7038, 7045 మంచి ఫలితాలనిచ్చాయని, వీటిలో 7034, 7045 మరింత ఆశాజనకంగా ఉన్నాయన్నారు. పశుగ్రాస పంటలకు మితిమీరి యూరియాను వేస్తున్నారని, ఇది తగదని, ఇలా వేయడం వలన తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని సూచించారు. యూరియా వినియోగంపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని కోరారు. చెరకు, వేరుశనగ, మొక్కజొన్న పంటల విస్తీర్ణం తగ్గుతోందని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, ప్రధాన శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి కుమారి, దాడి ఉమామహేశ్వరరావు, తదితరులు ప్రసంగించారు.

## అందుబాటులోకి ఫుడ్ ల్యాబ్




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం నగరంలో మూడేళ్ల క్రితం నిర్మితమైన స్టేట్ ఫుడ్ లేబొరేటరీని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రస్తుతం మైక్రో బయాలజీ ల్యాబ్‌ను ప్రారంభించారు. త్వరలో కెమికల్ ల్యాబ్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో మాత్రమే స్టేట్ ఫుడ్ లేబొరేటరీ ఉండేది. రాష్ట్ర విభజన జరిగి సుమారు పదకొండేళ్లు దాటుతున్నా ఇప్పటివరకూ ఏపీలో స్టేట్ ఫుడ్ లేబొరేటరీ లేదు. ఎనిమిదేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ల్యాబ్ మంజూరుచేసింది. సుమారు రూ.20 కోట్లు వెచ్చించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెదవాల్తేరులోని ఈఎన్‌టీ ఆస్పత్రి పక్కన ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో ల్యాబ్ ఏర్పాటుకోసం భవనం నిర్మించారు. మూడేళ్ల కిందటే పనులు పూర్తయ్యాయి. రెండేళ్ల కిందట ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ఈ లేబొరేటరీని ప్రారంభించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సుమారు 15 కోట్ల రూపాయలు విలువజేసే అత్యంత ఖరీదైన పరికరాలు, మరో ఐదు కోట్ల రూపాయలు విలువజేసే కెమికల్ కూడా ల్యాబ్‌కు చేరాయి. దీంతో స్టేట్ ఫుడ్ లేబొరేటరీ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని అంతా భావించారు. అయితే, పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకాన్ని అధికారులు చేపట్టకపోవడంతో ల్యాబ్ నిరుపయోగంగా ఉంది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సేకరించిన నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ నుంచి ఫలితాల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేంది. ఫుడ్ లేబొరేటరీని ప్రారంభించకపోవడం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ కొద్ది నెలల కిందట 'ఆంధ్రజ్యోతి' కథనంగా ప్రచురించింది. దీంతో ఉన్నతాధికారులు స్పందించి ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఆదేశాలు జారీచేశారు. ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతం ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో పనిచేస్తున్న జూనియర్ అనలిస్టులను స్టేట్ ఫుడ్ లేబొరేటరీకి అధికారులు బదలాయించారు. అలాగే గ్రామ/వార్డు సచివాలయాల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ అర్హతతో ఉద్యోగాలు చేస్తున్న కొందరిని ఎంపిక చేసి ఈ ల్యాబ్‌కు కేటాయించాలని కూడా నిర్ణయించారు. మొత్తం 40 నుంచి 60 మంది వరకూ అనలిస్టులను నియమించనున్నారు. ఈ ల్యాబ్‌లో 15 రకాల పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. అయితే, ప్రస్తుతం ఉన్న సిబ్బందితో ఆరు రకాల ఉత్పత్తులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించనున్నారు. పాలు/పాల ఉత్పత్తులు, ఆయిల్/ఆయిల్ ఫ్యాట్, తృణ ధాన్యాలు/పిండి, హెూటల్స్‌లో తయారుచేసే ఆహార పదార్థాలు, నీటి పరీక్షలు, టీ, కాఫీ వంటి పౌడర్లకు సంబంధించిన నాణ్యత పరీక్షలను నిర్వహించనున్నారు.

## కింతాడ పంచాయతీ వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బండారు గంగా శ్రీనివాస్ నాయుడు





**కె.కోటపాడు, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా కే. కోటపాడు మండలం కింతాడ పంచాయతీ వైయస్సార్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఇదే గ్రామానికి చెందిన బండారు గంగా శ్రీనివాస్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ, తనను ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. సుమారు 80 మంది కింతాడ పంచాయతీలో పాల్గొని, తనకు ఆశీర్వాదాలు అందించాలని తెలిపారు. ఈ పదవి నాకు ఇచ్చినందుకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి ఈర్లే అనురాధ, సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ కు, వైసీపీ లీడర్, సీనియర్ వైసీపీ నాయకులు, కింతాడ వైస్ ప్రెసిడెంట్, బండారు ముత్యాల నాయుడు కి, ఎంపిటిసి సభ్యులు పల్లా రాజేశ్వరరావు కి, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవితో కింతాడ పంచాయతీలో పలు కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు బండారు గంగా శ్రీనివాస్ నాయుడు విలేకరులకు తెలిపారు .

## 13 మండలాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో వీఎంఆర్‌డీఏ విలీన మండలాల అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేయబోతున్నారు. జిల్లాలో వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న 13 మండలాల్లో ఈ సర్వే జరుగుతోంది. జియోకాన్ సర్వేస్ ప్రైవేటు లిమిటెడ్, ఖరగ్‌పూర్ ఐఐటీ సంస్థ సంయుక్తంగా సర్వే చేస్తున్నాయి. మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి, చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట, నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, నాతవరం, కోటవురట్ల మండలాలు, విజయనగరం జిల్లాలోని మొరకముడిదం మండలాలు వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్నాయి. ఈ మండలాలలో 2047లో జనాభా అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారు. రహదారుల విస్తరణ, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య, గృహాలు, మిక్స్‌డ్ యూజెస్, రవాణా, వర్క్ సెంటర్లు, పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్, గ్రీనరీ, రిక్రియేషన్ జోన్లుగా విభజిస్తారు. రెవెన్యూ సరిహద్దు మ్యాపింగ్, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు గుర్తిస్తున్నారు. నర్సీపట్నం పురపాలక సంఘం బృహత్తర ప్రణాళిక సిద్ధం చేశారు. మండలాల్లో మాస్టర్ ప్లాన్ పూర్తి చేసిన తర్వాత అమృత్ పథకం నిబంధనల ప్రకారం ఒక మాస్టర్ ప్రణాళిక తయారు చేస్తారు. ప్రస్తుతం సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయి. వీఎంఆర్‌డీఏ పరిధిలోని మండలాల్లో బృహత్తర ప్రణాళిక సిద్ధం చేసి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు.

## టెన్త్ విద్యార్థులకు దిశా ఒలింపియాడ్ పరీక్షలు







**మల్కాపురం, పతాకం న్యూస్ :** శ్రీహరిపురం బ్రాంచ్ భాష్యం విద్యా సంస్థలు 1వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు దిశా ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించాయి. ఈ పరీక్షలు విద్యార్థులలోని ప్రతిభను మరియు ఆప్టిట్యూడ్‌ను పెంపొందించడానికి ఉద్దేశించినవి. ర్యాంకులు మరియు బహుమతులు: కొంతమంది విద్యార్థులు మొదటి, రెండవ మరియు మూడవ ర్యాంకులను సాధించి తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రోత్సాహం: ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రిన్సిపాల్, ఎవీ మరియు తల్లిదండ్రుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడానికి మరియు వారిలో ఉత్తేజాన్ని పెంపొందించడానికి ఈ పరీక్షలు ఎంతగానో సహాయపడతాయి. విద్యార్థుల ప్రతిభను గుర్తించడంలో భాష్యం విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయి.

## జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక



**చింతపల్లి, పతాకం న్యూస్:** జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం బీఎస్సీ విద్యార్థి సీహెచ్ మహేశ్, ద్వితీయ సంవత్సరం బీఏ విద్యార్థి వి.మహేశ్, ప్రథమ సంవత్సరం బీఏ విద్యార్థి జె.జీవన్‌లు డివిజన్, రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ఈ మేరకు ఈ నెల 5 నుంచి తొమ్మిదవ తేదీ వరకు మొహాలీ పంజాబ్ చండీఘర్ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ రెజ్లింగ్ పోటీలకు వారు ఎంపికయ్యారని చెప్పారు. రెజ్లింగ్ శిక్షణ ఇస్తున్న పీడీ శివరామ్‌కుమార్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

## జాంకర గూడలో రగ్గుల వితరణ: ఆదివాసీ గిరిజన సంఘం



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** మండలం కండ్రుం పంచాయతీకి చెందిన జాంకర గూడ గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో 80 మంది ఆదివాసీ కుటుంబాలకు ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి. సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో నిరుపేద గిరిజన కుటుంబాలకు సహాయం అందించడం సంఘం బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని సాగర పంచాయతీ అడపవలస, తూటంగి పంచాయతీలోని లాసేరు, బలకట్టు, బూసిపుట్టు, బల్డ్‌గడ గ్రామాల్లో మరో 350 నిరుపేద గిరిజన కుటుంబాలకు ఉచిత రగ్గులు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామవహనందర్, టి. పరన్న, సద్దు, హరి, లైకోన్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్టెంపాడు గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహణ

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం, చెట్టెంపాడు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి క్రిష్ణకుమారి ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో,డిప్యూటీ ఎంపీడీవోలు హాజరై గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాన్ని పరిశు భ్రంగా ఉంచే లక్ష్యంతో త్వరలో స్వచ్ఛరథల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు,అలాగే సంక్రాంతి పండుగలోపు స్వచ్ఛ వారోత్సవాలు నిర్వహించనున్నారు.

## ఐటీడీఏ పీవో శ్రీపూజ సుడిగాలి పర్యటన



**అరకులోయ, పతాకం న్యూస్:** మండలంలో పాడేరు ఐటీడీఏ పీవో, జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ సుడిగాలి పర్యటన చేశారు. పలు పాఠశాలలు, పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత సుంకరమెట్ట పీహెచ్‌సీని సందర్శించి హాజరుపట్టి, అవుట్ పేషెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆసుపత్రిలో డెలివరీలపై ఆరా తీశారు. అనంతరం కరకవలస, పిరిబంద పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. మండలంలో బలియగుడ అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సుంకరమెట్ట నుంచి కటికి జలపాతం వరకు రోడ్డు నాణ్యతా పనులను నిశితంగా పరిశీలించారు. మండలంలో బలియగుడ, బొరకలవలస, పెదవలస గ్రామాలలో చేతిబోరులు సరిగా పనిచేయడం లేదని గ్రామస్థులు పీవో దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను పీవో ఆదేశించారు. బొరకలవలసలో రీసర్వే ప్రాజెక్టు కింద పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అభిప్రాయసేకరణ ఫోన్‌కాల్ వస్తే మంచి జరిగితే ఒకటి నొక్కండి.. లేకుంటే రెండు నొక్కండంటూ ఆమె రైతులకు సలహా ఇచ్చారు. ఈ పట్టాల ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, బ్యాంకు రుణాలు వంటివి పొందవచ్చునన్నారు. పీఎం జన్‌మన్ పథకం కింద నిర్మించిన గృహాలకు కొత్తగా ఎలక్ట్రికల్ మీటర్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరారు. కార్యక్రమంలో లోతేరు సర్పంచ్ జి.కళావతి, తహశీల్దార్ కుమారుస్వామి, డీటీ గోవిందు, నవాన్‌బాబు, వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా లోతేరు గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో చదవడం, రాయడం సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్ అమలుపరచడం లేదని హెచ్‌ఎంకు నోటీసు జారీ చేశారు. డిప్యూటీ వార్డెన్ అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్టాక్ మార్కెట్ అవగాహన కార్యక్రమం



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్టాక్ మార్కెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెబి ఎంపానెల్డ్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ శ్రీను ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్టాక్ మార్కెట్ గురించి వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీను మాడేమ్ మాట్లాడుతూ, ప్రైమరీ మార్కెట్, సెకండరీ మార్కెట్, క్యాపిటల్ మార్కెట్, మనీ మార్కెట్‌ల గురించి వివరించారు. పెట్టుబడిదారులు పెట్టుబడులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల విధులు, సెబి గైడ్‌లైన్స్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. స్టాక్ మార్కెట్‌లో ఉన్న ఉద్యోగ అవకాశాల గురించి కూడా క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి. కొండబాబు, పి. సుందరి రాణి, పి. నాగబాబు, ఎల్.ఎం.ఎస్. గణేష్, వై. విజయలక్ష్మి, ఏం. అనిత కుమారి, ఎస్. రాజు, బి. లచ్చన్న, వి. కామేశ్వరరావు, అప్పారావు, ఎస్. రాంబాబు, ఎస్. సునీల్, సి.హెచ్. వన్య పాల్, కే. అంబిక, ఎస్. ధోన్ను, కే. భవాని, ఎస్. సురేష్ తదితర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగు మహాసభలలో గౌరవం దక్కడం గర్వకారణం :కృష్ణారావు



**విజయనగరం, పతాకం న్యూస్:** గుంటూరులో ఈ నెల 3, 4, 5 తేదీలలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో విజయనగరం జిల్లా చీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు, కవి, రచయిత జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిరియాల కృష్ణారావును ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తెలుగు భాష వైభవాన్ని, సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేస్తున్నందుకు ఇలాంటి వేదికపై గౌరవం దక్కడం ఎంతో గర్వకారణంగా ఉందని సన్మాన గ్రహీత డాక్టర్ మిరియాల కృష్ణారావు తెలిపారు. కవిగా, రచయితగా తెలుగు భాషకు చేస్తున్న కృషికి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులు తనని ఈ వేదికపై గౌరవించడం పట్ల ఆయన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు భాష ఔన్నత్యానికి కృషి చేస్తున్నందుకు ఇది తనకి దక్కిన 200వ సన్మానమని తెలిపారు. ఈ మహాసభలలో డాక్టర్ మిరియాల కృష్ణారావు తెలుగు భాష పై ప్రేమను, సామాజిక స్పృహను, మానవ విలువలను హృద్యంగా వ్యక్తపరిచి తెలుగు భాషాభిమానుల మన్ననలను పొందారు. ఆయన కవితలు సభను ఆలోచనాత్మకంగా మలిచినట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రశంసించారు.

## పెంకి పురుగుల నుంచి కాపాడండి మహాప్రభో శ్రీరామ్ నగర్ వాసుల గగ్గోలు




**గాజువాక, పతాకం న్యూస్.** గాజువాక నియోజకవర్గం 71వ వార్డు శ్రీరామ్ నగర్ పరిధిలో ఉన్న ఎఫ్ సి ఐ గోడౌన్స్ ద్వారా వచ్చే పెంకి పురుగులు మరియు ఇతర విషపూరితమైన పురుగుల వలన స్థానికులు ఇబ్బందులకు లోను అవుతున్నారని టిడిపి రాష్ట్ర పరిశీలకులు పప్పు రాజారావు సోమవారం జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఎఫ్ సి ఐ గోడౌన్స్ ద్వారా కాలనీ నివాస ప్రాంతాలపై పెంకి పురుగులు ఇతర విషపూరితమైన పురుగులు ఎగిరిరావడం వలన బోజనాల పళ్లాలలో మరియు చిన్న, పెద్దవాళ్ళ చెవుల్లో దూరిపోవడంతో ఇబ్బందికరంగా ఉన్నదన్నారు. ప్రాంగణము పరిశుభ్రం లోపించడం వలన పందులు, కుక్కలు ఈ ప్రాంతములో తిరుగుతూ మనుషులపై దాడి చేస్తున్నవి.రాత్రి సమయములో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూ ఉండడమువలన ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉన్నది కనుక అధికారులు తక్షణం తగుచర్యలు తీసుకోవాలని జీవీఎంసి కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు. ఎఫ్ సి ఐ గొడౌన్స్ ని ఏపీఐఏసి ప్రాంగణములోకి మార్చాలని పుర ప్రజలు కోరుతున్నారు. అలాగే గత మూడు సంవత్సరాల క్రితము నుండి చనిపోయిన వృద్ధుల వాళ్ళ కుటుంబ సభ్యులకు పెన్షన్ సదుపాయం కల్పించకపోవడం, సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడం వలన వాళ్ళ కుటుంబ జీవన ఉపాధి ఇబ్బందికరంగా ఉన్నది. తక్షణం వాళ్ళ కు సహాయ సహకారాలు అందజేయాలని పప్పు రాజారావు విజ్ఞప్తి చేశారు .

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు కర్త, కర్మ, క్రియ చంద్రబాబే: ఎంపీ కలిశెట్టి



**మంగళగిరి, పతాకం న్యూస్:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి కర్త, కర్మ, క్రియ అన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబేనని, అలాంటిది ఆ క్రెడిట్ తనదేనని జగన్ చెప్పుకోవడం అత్యంత హాస్యాస్పదంగా ఉందని విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్రంగా విమర్శించారు. కేవలం కొబ్బరికాయ కొట్టగానే క్రెడిట్ వచ్చేయదని జగన్ గ్రహించాలని హితవు పలికారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014-19 మధ్య చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తే, ఆ తర్వాత ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తిగా మూలన పడేసిందని అప్పలనాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం 18 నెలల్లోనే ప్రధాని మోదీ సహకారంతో 95 శాతం పనులు పూర్తి చేసిందని, జనవరి 4న తొలి విమానం ల్యాండ్ అయిందని గుర్తుచేశారు. మరో ఐదారు నెలల్లో, జూన్ నాటికి విమానాశ్రయాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అంకితం చేయనున్న తరుణంలో, జగన్ ట్వీట్ చేసి క్రెడిట్ తీసుకోవాలని చూడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంపై గూడుపువలస, భోగాపురం, పులివెందుల లేదా రాష్ట్రంలో ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, వైసీపీ నేతలు సిద్ధమా? అని ఆయన సవాల్ విసిరారు. ఎవరి హయాంలో అనుమతులు వచ్చాయి, ఎవరు పనులను ఆటంకపరిచారో తేల్చుకుందామన్నారు. ‘గతంలో ‘ఎర్రబస్సు రాని భోగాపురానికి ఎయిర్‌పోర్టా?’ అని, ‘విశాఖ ఎయిర్‌పోర్టుకు దోమలు, ఈగలు వస్తాయి గానీ మనుషులొస్తారా?’ అని హేళన చేసి ఉత్తరాంధ్ర ప్రజలను అవమానించిన జగన్, ఇప్పుడు అదే ప్రాజెక్టుకు తానే కర్తనని చెప్పుకోవడం సిగ్గుచేటు’ అని మండిపడ్డారు. ‘కమీషన్ల కోసం జీఎంఆర్ సంస్థకు పనులు కట్టబెట్టారని గతంలో చంద్రబాబుపై జగన్ ఆరోపణలు చేశారు. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చాక అదే జీఎంఆర్ సంస్థకు టెండర్లు ఇవ్వలేదా? ఇది జగన్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మేం ఒకే మాట మీద ఉంటాం’ అని అప్పలనాయుడు స్పష్టం చేశారు. గూగుల్, ఐటీ, విజనరీ, డెవలప్‌మెంట్ అంటే చంద్రబాబే గుర్తుకొస్తారని, అవినీతి, విధ్వంసం, దోపిడీ అంటే జగన్ గుర్తుకొస్తారని ఎద్దేవా చేశారు. ‘జగన్‌కు ఉన్నది క్రిమినల్ మైండ్. ఆ క్రెడిట్‌ను ఎవరూ కోరుకోరు, దొంగిలించలేరు. దొంగిలిస్తే జైలుకు పోక తప్పదు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అభివృద్ధి పనుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్ ఇలాంటి ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమయ్యే రోజులు పోయాయని, ఇప్పటికైనా జగన్ జ్ఞానోదయం పొంది వాస్తవాలు మాట్లాడాలని సూచించారు. వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ ఛైర్మన్ వరకు అన్ని ఎన్నికల్లో ఎన్డీయే కూటమిదే విజయమని, ప్రజలు కూటమి పాలనను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని అప్పలనాయుడు ధీమా వ్యక్తం చేశారు.

## భోగాపురం విమానాశ్రయానికి తొలి విమానం రాకతో విశాఖ ప్రజల్లో రెట్టింపు ఉత్సాహం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణంగా రూపుదిద్దుకుంటున్న బోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి తొలి విమానం విజయవంతంగా రావడంతో విశాఖ ప్రజల్లో అపూర్వ ఆనందం, ఉత్సాహం వెల్లివిరిసిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంఉరాష్ట్రం కలిసి అమలు చేస్తున్న డబుల్ ఇంజిన్ సర్కార్ విధానాల ఫలితంగానే ఈ కీలక మౌలిక వసతి ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ముఖ్యంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చూపుతున్న నిరంతర చొరవ వల్ల విమానాశ్రయ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి దశకు చేరుకుంటున్నాయని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయనకు వెన్నా శ్రీరామమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది జూన్ లేదా జూలై నెలల నుంచి బోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రెగ్యులర్ విమాన సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక ప్రగతికి మార్గదర్శకత్వం వహించిన ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్‌లకు వెన్నా శ్రీరామమూర్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పూడుకుపోయిన కాలువలు

### ఆరు వేల ఎకరాలకు చుక్కనీరు అందని దుస్థితి



**చోడవరం, పతాకం న్యూస్:** మండలంలోని సాగునీటి కాలువలు పూడుకుపోయాయి. తుప్పలు పెరిగిపోయి కాలువల ఆనవాళ్లే లేకుండాపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురికాగా, ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వందలాది ఎకరాలకు సాగునీరు అందించే మండలంలోని సాగునీటి కాలువల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా ఉంది. కాలువలపై ఆధారపడిన భూములకు సాగునీరు అందని దుస్థితి కొనసాగుతోంది. వర్షాలు తగ్గి వాతావరణం అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో సాగునీటి కాలువల పనులు చేపడితే వచ్చే సీజన్ నాటికి కాలువల్లో నీరు పారే అవకాశం ఉంది. కానీ సాగునీటి కాలువల అభివృద్ధి పనుల్లో కదలిక కనిపించడం లేదు. ఈ ఏడాది మే నెలలో మండలంలో ఆరు కాలువలకు నిధులు మంజూరైనప్పటికీ, ఈ కాలువల అభివృద్ధి పనులు మాత్రం ముందుకు కదల్లేదు. తరువాత వర్షాలు రావడంతో సాగునీటి కాలువల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో కాలువల పరిస్థితి అధ్వానంగా మారడంతో సాగునీటి కాలువల పరిధిలోని పంటభూముల్లో వ్యవసాయం దైవాదీనంగానే మారిపోయింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రైవాడ, పెద్దేరు, ఇతర చెరువులు, ఆవల పరిధిలోని సాగునీటి కాలువలకు గత ప్రభుత్వంలో కనీస స్థాయిలో కూడా నిర్వహణకు నిధులు కేటాయించలేదు. దీంతో ఎక్కడికక్కడ కాలువల్లో తుప్పలు పేరుకుపోయి సాగునీటి కాలువల ఆనవాళ్లు లేకుండాపోయాయి. మండలం పరిధిలో రైవాడ కాలువ కింద లక్కవరం, గవరవరం, సింహాద్రిపురం, చోడవరం, జుత్తాడ, రేవళ్లు, తదితర ప్రాంతాలకు చెందిన పంట భూములు ఉన్నాయి. రైవాడ కాలువల నిర్వహణ లేకపోవడంతో ఈ పంచాయతీల్లోని వందలాది ఎకరాలకు సాగునీరు చాలా కాలంగా అందని దుస్థితి నెలకొంది. లక్కవరం ప్రాంత రైతులు, రేవళ్లు ప్రాంత రైతులు కొంతకాలం చందాలు వేసుకుని శ్రమదానంతో కాలువలు బాగు చేసుకుని సాగునీరు తెచ్చుకోవడానికి ప్రయత్నాలు చేసినా అధికారుల్లో కానీ, ప్రభుత్వంలో కానీ స్పందన లేకపోవడంతో రైతులు అలసిపోయారు. రైవాడ కాలువలు బాగు చేయాలంటూ రైతు సంఘం నాయకుడు కోన మోహనరావు ఆధ్వర్యంలో రైతులు ఆందోళనలు చేసి, జలవనరుల శాఖ అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన కరువైంది. ఇక ఈ రైవాడ కాలువల సంగతి పక్కన పెడితే, పెద్దేరు నది మీద ఉన్న గ్రోయిన్లు చాలాకాలంగా శిథిలావస్థకు చేరడంతో ఈ గ్రోయిన్ల పరిధిలోని కాలువలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మండలంలోని పెద్దేరు పరిధిలోని సాగునీటి కాలువలు కూడా తుప్పలు పెరిగిపోయి నీరు పారని పరిస్థితి నెలకొంది. బెన్నవోలు ఆవ నుంచి వచ్చే సాగునీరు పరిధి కుంచించుకుపోయింది. ఈ సాగునీటి కాలువల నిర్వహణ లేకపోవడంతో నీరు పారడం లేదు. రెండేళ్ల క్రితం బెన్నవోలు ఆవలో జన్నవరం ప్రాంతానికి చెందిన రైతులు శ్రమదానంతో కాలువలు బాగు చేసినా, మళ్లీ మరుసటి ఏడాదికి పరిస్థితి మొదటికే వచ్చింది. గతంలో ఏటా జలవనరుల శాఖ అధికారులు వానాకాలం రాక ముందే వేసవిలో సాగునీటి కాలువల్లో పూడిక, చెత్త తొలగించే పనులను ఉపాధి నిధులతో చేపట్టేవారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువలను పూర్తిగా పట్టించుకోకపోవడంతో సాగునీటి వనరులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెద్దేరు నది, బెన్నవోలు ఆవ పరిధిలో బెన్నవోలు ఆవ కాలువ, బెన్నవోలు నుంచి జన్నవరం కాలువ కింద బెన్నవోలు, తిమ్మనపాలెం, కన్నంపాలెం, చాకిపల్లి వరకు సుమారు రెండు వేల ఎకరాలు కాలువలపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ కాలువల్లో బెన్నవోలు నుంచి జన్నవరం కాలువ పనులు మాత్రం ప్రారంభమై కొంత మేర పనులు జరిగిన తరువాత చెల్లింపులు లేక పనులు ఆగిపోయాయి. దీంతో ఈ కాలువల కింద భూములకు సాగునీరు అందడం లేదు. మొత్తం మీద మండలంలోని సాగునీటి కాలువలపై ఉన్న ఆరు వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగానే ఉండడంతో రైతాంగంలో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ ఏడాదైనా సాగునీటి కాలువల అభివృద్ధి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## జీతాలు ఇవ్వకపోయినా ఉత్పత్తిలో రికార్డులు బద్దలు కొడుతున్న ఉక్కు కార్మికులు

**గాజువాక, పతాకం న్యూస్:** విశాఖ స్టీల్ కార్మికుల ధృడ సంకల్పం మరొక్కసారి రుజువైంది. ఆదివారం 3 షిఫ్ట్ లలో ఎస్ ఎం ఎస్ విభాగంలో 78 హీట్లు ప్రొడక్షన్ తీసి కార్మికవర్గం సత్తా మరొక్కసారి నిరూపించింది. గత నెలలో 76హీట్ల రికార్డును బ్రేక్ చేసి ఈ రికార్డ్ నెలకొల్పారు. గత 4 ఏళ్లుగా స్టీల్ ప్లాంట్ పరిస్థితి తీవ్ర గందరగోళంలో ఉన్నప్పటికీ ఒక వైపు శాంతియుత ఆందోళన కార్యక్రమాలు చేస్తూనే, యాజమాన్యం అసమర్ధత, గత ప్రభుత్వాలు స్వార్ధపూరిత నిర్ణయాలు వలన తీవ్ర నష్టాల్లో కూరుకుపోయినా, చాలి చాలని జీతాలు, సౌకర్యాలు అన్నీ కోత, అయినా మొక్క వోని దీక్షతో కార్మికవర్గం రోజు రోజుకు తన సత్తా చాటుతూనే ఉన్నది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ పరిరక్షణ కొరకు సుమారు 15 వేల కోట్ల రూపాయలు ఆర్ధిక సాయం చేసి అంపశయ్య పై నున్న ప్లాంట్ ను గట్టేక్కించే ప్రయత్నం చేస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు.

## వృత్తి జీవితానికి ఏఐ హానికరమని మాట్లాడటాన్ని ఆపేయాలి: సత్య నాదెళ్ల




**న్యూయార్క్:** కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కారణంగా వృత్తి జీవితానికి హానికలుగుతుందనే వాదనలను నిలిపివేయాల్సిన సమయం ఆసన్నమైందని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ః లుకింగ్ ఎహెడ్ 2026ః పేరిట ఆయన తన బ్లాగ్‌లో పలు అంశాలను పంచుకున్నారు. కృత్రిమ మేధలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ సాంకేతికతకు సంబంధించి, ప్రతి ఒక్కరూ కొత్తదనపు దశను అధిగమించి, వాస్తవ ప్రపంచంపై దాని ప్రభావం పట్ల దృష్టి సారించాలని సూచించారు. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఏఐ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని, ఇది మానవులకు ప్రత్యామ్నాయం కాదని ఆయన స్పష్టం చేశారు. ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో ఉత్పత్తి రూపకల్పన, సామాజిక అంశాల ప్రాముఖ్యతను గుర్తించాలని ఆయన అన్నారు. ఏఐ పరిశ్రమ కొత్తదనపు దశ నుంచి సవాళ్లతో కూడిన సమయంలోకి ప్రవేశించిందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా వేలాది కంపెనీలకు సేవలందించిన ఆఫీస్, విండోస్ సాఫ్ట్‌వేర్ స్థానంలో ఏఐ ఏజెంట్లను వినియోగించాలని మైక్రోసాఫ్ట్ భావిస్తోందని ఆయన తెలిపారు. ఏఐను స్వతంత్ర మేధస్సుగా పరిగణించరాదని ఆయన అభిప్రాయపడ్డారు. మానవ ఆలోచనలను మెరుగుపరిచే, ప్రజల లక్ష్యాల సాధనకు తోడ్పడే ఒక సాధనంగా దీనిని చూడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఏఐని ఏ విధంగా వినియోగిస్తారనే దానిపై ఈ సాంకేతికత వినియోగం ఆధారపడి ఉంటుందని తెలిపారు. కోపైలట్, అనుబంధ ఉత్పత్తులను బలోపేతం చేయడానికి, మరింత ఆధునిక ఏఐ నమూనాలపై మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెడుతోందని ఆయన వెల్లడించారు.

## పార్టీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికి అవకాశాలు: నాగబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** పార్టీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికి అవకాశాలు వస్తాయని జనసేన ఎమ్మెల్సీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి_. నాగబాబు స్పష్టం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎన్ఆర్ఐ జనసేన శ్రేణులతో నాగబాబు వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టిన గొప్ప నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అని అభివర్ణించారు. రాష్ట్రంలో 24వ స్థానంలో ఉన్న పంచాయతీరాజ్ శాఖను పవన్ కల్యాణ్.. మొదటి స్థానంలోకి తీసుకు వచ్చారని వివరించారు. కూటమి కలకాలం కలిసి ఉండాలని ప్రజలు భావిస్తు?న్నారని తెలిపారు. అందరం కలిసిమెలిసి రాష్ట్రాభివృద్ధి కోసం పని చేద్దామంటూ ప్రజలకు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగబాబు పిలుపునిచ్చారు.

## జలగ మందు వికటించి 19 గొర్రెలు మృత్యువాత



**ఏలూరు, పతాకం న్యూస్:** ఉంగుటూరు మండలం అక్కుపల్లిగోకవరం గ్రామానికి చెందిన ఆకుల గంగరాజు అనే వ్యక్తి ఆదివారం అదే గ్రామంలో ఓ ఔషధ దుకాణంలో జలగమందు (ఖీూరీవీఐచీ -ఋూ) ఇది పశువుల్లో యాంటి -హేల్మిన్తిక్ పరాన్న జీవి వ్యతిరేక మందు) తీస్తుల్లి.. మేత అరుగుదల కోసం గొర్రెలకు పట్టించాడు. అదేరోజు మధ్యాహ్నం వణుకుతూ 19 గొర్రెలు మరణించాయి. అస్వస్థతకు గురైన మరో 28 గొర్రెలను సోమవారం ఉదయం చేబ్రోలులోని పశు వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యాధికారి పప్పు కిషోర్ కుమార్ వాటికి వైద్యం చేశారు.చనిపోయిన రెండు గొర్రెలు, అస్వస్థతకు గురైన ఒక గొర్రెను ఏలూరులోని ఏడీడీఎల్ కేంద్రానికి పోస్టుమార్టం కోసం పంపించారు. తనకు జీవనాధారమైన గొర్రెలు మృతి చెందడంతో రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు గంగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు చేబ్రోలు ఆసుపత్రి వద్ద చనిపోయిన గొర్రెలను పరిశీలించి బాధితులను ఓదార్చారు. దుకాణంలో మిగతా జలగ మందు సీసాలను స్వాధీనం చేసుకుని విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా గొర్రెల మృతికి పరిమితికి మించిన ఔషధం డోసు ఇచ్చారా ?.. లేదా పశువులకు అమ్మే ఔషధాల నాణ్యతలను పర్యవేక్షంచించాల్సిన తనిఖీ అధికారుల వైఫల్యమా? అనేది పోస్టుమార్టం నివేదికలో వెల్లడి కావాల్సి ఉందని వైద్యాధికారి వెల్లడించారు. ఔషదం తయారు కంపెనీ ప్రతినిధులు, దుకాణం నిర్వాహకులు రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

# ‘విబిజిఆర్ఎంజి’తో ఉపాధి హామీ లేదు?



**అమరావతి, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఇజిఎ) స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ఉ గ్రామీణ్ (విబి జి ఆర్ఎఎం జి) పథకంలో వేతనదారులకు చట్టబద్ధమైన గ్యారంటీకి కేంద్రం స్వస్తి పలికింది. వేతనదారులకు ఇక ఉపాధికి హామీ లభించే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్రంపై విబి జి ఆర్ఎఎం జి పథకం ప్రభావాన్ని అంచనా వేసిన లిబ్ టెక్ సంస్థ ఈ విషయాలను వెల్లడించింది. ఇందుకు సంబంధించిన నివేదికను శనివారం విడుదల చేసింది. కొత్త పథకంతో గ్రామీణ వేతనదారులకు ఉపాధి ఇకపై డిమాండ్ ఆధారిత హక్కుగా కాకుండా, ప్రభుత్వ బడ్జెట్, నోటిఫికేషన్లు, టెక్నాలజీ, కాలానుగుణ ఆంక్షలపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. గ్రామీణ ఉపాధి ఒక చట్టబద్ధమైన హక్కుగా ప్రస్తుతం ఉండగా, అది పరిపాలనా, నిర్వాహణ ఆధారిత విధానానికి మారుతుందని వెల్లడించింది. తాజాగా పెంచిన 125 రోజుల పని దినాల హామీ ఉపాధి హక్కుతో ఎట్టిపరిస్థితుల్లోనూ సమానం కాదని తెలిపింది. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు సగటున కల్పిస్తున్న పని దినాలు 51.6 రోజులు మాత్రమేని, ఇక 100 రోజుల పని దినాలను పూర్తి చేసుకున్న కుటుంబాలు కేవలం 11 శాతమే ఉన్నట్లు పేర్కొంది. ఇందుకు కారణం ఆర్థిక, పరిపాలనా పరిమితులేనని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ఉన్న ఎంజిఎన్ఆర్ఇజిఎ రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతుంది. విబి జి ఆర్ఎఎం జితో ఈ పరిస్థితి ఉండదని తేల్చింది. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాలకు మాత్రమే ఇది పరిమితం అవుతుందని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నప్పటికీ భవిష్యత్తులో అన్ని ప్రాంతాల్లో ఈ పథకం అమలవుతుందనే విషయంపై స్పష్టత లేదని వెల్లడించింది. ఈ విధానం వల్ల తక్కువ సంఖ్యలో ఉండి వివిధ ప్రాంతాల్లో విస్తరించిన ఆదివాసీ సమూహాలు ఉపాధికి దూరమయ్యే ప్రమాదం నెలకొందని తెలిపింది.


విబి జి ఆర్ఎఎం జితో ఉపాధి పథకం వ్యయ భారం రాష్ట్రాలపైకి మారనుందని పేర్కొంది. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటా అమలులోకి వస్తుందని తెలిపింది. కేంద్రం తన వాటాను పూర్తి స్థాయిలో, సకాలంలో చెల్లిస్తుందనే చట్టబద్ధమైన హామీ లేదని వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు సుమారు రూ.10 లక్షల కోట్లకు చేరుకున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం వ్యయం మేరకు అంచనా వేస్తే ఉపాధికి విబి జి ఆర్ఎఎం జిలో రూ.3,470 కోట్లను రాష్ట్రం భరించాల్సి వస్తుందని తెలిపింది. కొత్త చట్టంతో రాష్ట్రంపై భారం ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. మొత్తం వ్యయంతో కేంద్రం 60 శాతం వాటా భరిస్తుందని చట్టబద్ధమైన హామీ లేదని తెలిపింది.

‘ఉపాధి’ చట్టంలో వ్యవసాయ సీజన్‌లో ఉపాధి పనులు కల్పించకూడదనే చట్టపరమైన నిషేధం లేదని, కొత్త చట్టంలో ఈ సీజన్‌లో 60 రోజుల పాటు చట్టబద్ధంగా ఉపాధి పనులను నిలిపివేసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఏడాది పొడవునా ఉపాధి హామీ అనే భావన బలహీనపడుతుందని, మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పనులు ఒకే సమయంలో వచ్చే అవకాశం లేదని, ప్రాంతాల మధ్య వ్యత్యాసాల వల్ల పంట కాలల్లో తేడాలు ఉంటాయని పేర్కొంది. విబి జి ఆర్ఎఎం జి చట్టంలో వేతనదారుల గుర్తింపు, హాజరు, పర్యవేక్షణ, వేతనాల చెల్లింపు అన్నింటికీ డిజిటల్ సాంకేతికతను తప్పనిసరి చేసిందని, దీనివల్ల వేతనదారులు ప్రభావం అధికంగా ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల కారణంగా 78 లక్షల కార్మికుల పేర్లు 2022-23 మధ్య తొలగించబడ్డాయని, తాజాగా ఇకెవైసి కారణంగా ఒకే నెలలో 16 లక్షల మందిని తొలగించినట్లు వెల్లడించింది. ఫలితంగా వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలు ఎక్కువగా నష్టపోతారని పేర్కొంది.

విబి జి ఆర్ఎఎం జితో రాష్ట్రంపై పడే ప్రభావాన్ని అంచనా వేసిన లిబ్ టెక్ సంస్థ ప్రభుత్వాలకు కొన్ని సిఫార్సులు చేసింది. వాటిలో గ్రామ సభల్లో కొత్త చట్టానికి సంబంధించి సమగ్ర సమాచారాన్ని ప్రజలకు పూర్తి స్థాయిలో అందించాలని సూచించింది. గ్రామ సభల్లో చర్చలు అర్థవంతంగా, పారదర్శకంగా, పూర్తి అవగాహనతో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరింది. విబి జి ఆర్ఎఎం జితో రాష్ట్రంలో ఉపాధి భద్రతపై కలిగే ప్రభావాలను ప్రభుత్వం తక్షణమే సమీక్షంచాలని సూచించింది. ఈ చట్టం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కలిగే ప్రభావాలను సమగ్రంగా పరిశీలించడానికి రాష్ట్ర శాసన సభ ప్రత్యేక చర్చ జరపాలని సూచించింది. సమీక్షల అనంతరం రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించాలని, కొత్త చట్టంలో ఫ్రేమ్ వర్క్‌ను పున్ణపరిశీలించాలని కోరడంతోపాటు, ఎంఎన్ఆర్ఇజిఎలో ఉన్న ఉపాధి హామీ, హక్కు ఆధారిత స్వభావాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేయాలని సూచించింది.

# పోలవరం నిర్మాణానికి రూ.62,436 కోట్లు!

## తాజాగా అంచనాలు వేసిన ఏపీ ప్రభుత్వం



**అమరావతి, పతాకం న్యూస్:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తాజా అంచనాల ప్రకారం మొత్తం రూ.62,436 కోట్లు ఖర్చవుతుందని తేలింది. ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం తొలిదశలో ం41.15 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలిపేందుకు వీలుగా పనులు చేపట్టేందుకు రూ.30,436.95 కోట్లు మంజూరు చేసింది. రెండో దశలో ం45.72 మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలిపేందుకు అవసరమైన నిధులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు మరో రూ.32,000 కోట్ల వరకు ఖర్చవుతుందని పోలవరం అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీనిపై సమగ్ర లెక్కలు రూపొందించి, త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. తొలిదశలో మంజూరైన నిధులు, రెండోదశ అంచనాలు కలిపి మొత్తంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.62,436 కోట్లకు చేరనుంది. ఈ అంచనాలపై సమగ్ర స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల దిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసిన సందర్భంగా రెండో దశ నిధుల సాధన కోసం లేఖ సమర్పించారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక గత 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు నిమిత్తం ఇచ్చిన నిధులు రూ.23,658.40 కోట్లు. తొలిదశలో మొత్తం రూ.30,436.95 కోట్లకు ఇంకా రూ.6,645 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇటీవల కేంద్రం అడ్వాన్స్‌గా నిధులు ఇస్తున్నందున ఒకప్పటిలా రీయింబర్స్‌మెంట్ తిప్పలు లేవు. పైగా ప్రస్తుతం కొంత అడ్వాన్స్ మొత్తం రాష్ట్ర ఖజానాలోనే ఉంది. ఇప్పటికే ఇచ్చిన అడ్వాన్స్‌లో దాదాపు 80% ఖర్చు చేసినందున మరో విడత నిధుల కోసం పోలవరం అథరిటీకి అధికారులు ప్రతిపాదించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3,034 కోట్ల వరకు రాబట్టుకోవాలని యోచిస్తున్నారు. ఈ తరుణంలో ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస చర్యలు వేగవంతం చేయాల్సి ఉంది.

17,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం : ఈ ప్రాజెక్టులో భాగంగా కుడి, ఎడమ కాలువలను ఏ ప్రవాహ సామర్థ్యం మేరకు తవ్వారో అందుకు తగ్గట్టుగా కేంద్రం నిధులు రీయింబర్స్ చేయలేదు. 2009 డీపీఆర్ ప్రకారం ఎడమ కాలువ 8,123 క్యూసెక్కులు, కుడి కాలువ 11,654 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం మేరకు తవ్వాలి. 2019లో సాంకేతిక సలహా కమిటీ సిఫార్సుల ప్రకారం రెండు కాలువలనూ 17,500 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం మేరకు నిర్మిస్తున్నారు. కుడి కాలువ నిర్మాణం పూర్తికాగా, ఎడమ కాలువ పనులు సాగుతున్నాయి.

2017-18 ధరల ప్రకారం, పెంచిన ప్రవాహ సామర్థ్యం మేరకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌లో ప్రతిపాదనలు సమర్పించింది. ప్రస్తుతం కేంద్రం 2009 డీపీఆర్ ప్రకారమే కాలువల పనులకు ధరలు కట్టింది. వాటిలోనూ కుడి కాలువకు సంబంధించి 93%, ఎడమ కాలువకు సంబంధించి 77% మాత్రమే అనుమతించి, మిగిలిన నిధులు కోత పెట్టింది. పెంచిన ప్రవాహ సామర్థ్యం మేరకు కాలువల నిర్మాణానికి అయిన ఖర్చు కేంద్రం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. తాజాగా దిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని కూడా కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ దృష్టికి తీసుకువెళ్లారు. 2005-06 నాటి అంచనాల ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.10,151.03 కోట్లు. తర్వాత ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమయ్యే కొద్దీ పెరిగిన ధరలకనుగుణంగా సవరణలు చేస్తూ వచ్చారు. అలా 2010-11, 2013-14, 2017-18 సంవత్సరాల్లో అంచనాలు సవరించారు. తాజాగా రెండో దశ నిర్మాణం దృష్ట్యా అంచనాలు మళ్లీ సవరిస్తున్నారు.

# డయాబెటిస్‌తో కిడ్నీలు దెబ్బతింటాయా?

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్న తీవ్రమైన ఆరోగ్య సమస్య (డయాబెటిస్(. ఈ వ్యాధి ఉన్నవారికి షుగర్ అదుపులోనే ఉన్నా కూడా, ఏళ్లు గడుస్తున్న కొద్దీ శరీరంలోని కీలకమైన అవయవాలను క్రమంగా దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. కళ్లు, గుండె, కిడ్నీలు.. ఇలా ప్రతి అవయవమూ కాలం గడుస్తున్న కొద్దీ షుగర్ ప్రభావానికి లోనవుతూ ఉంటుందని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా మూత్రపిండాలకు ఎక్కువ నష్టం కలుగుతుందని చెబుతున్నారు. ఈ పరిస్థితిని డాక్టర్లు డయాబెటిక్ నెఫ్రోపతి అని పిలుస్తారు. ఈ సమస్య బయటకు కనిపించకుండా లోలోపలే జరుగుతుంది కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారు క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యమని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!



డయాబెటిస్‌ను సరిగ్గా నియంత్రించకపోతే, అది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధికి (జఖణ) దారితీస్తుందంటున్నారు నిపుణులు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు, అవి కిడ్నీలలోని చిన్న రక్తనాళాలను దెబ్బతీస్తాయని చెబుతున్నారు . దీనివల్ల కిడ్నీలు వ్యర్థాలను వడపోసే సామర్థ్యాన్ని కోల్పోతాయని వివరిస్తున్నారు. ఈ క్రమంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలూ కనిపించవని తెలియజేస్తున్నారు. అందుకే, చాలా మందికి తమ కిడ్నీలు దెబ్బతింటున్నాయని తెలియదని వివరిస్తున్నారు. సాధారణ మూత్ర, రక్త పరీక్షల ద్వారా కిడ్నీ సమస్యలను ముందే గుర్తించి చికిత్స చేయవచ్చని సూచిస్తున్నారు. మధుమేహం ఉన్నవారికి మూత్రపిండాల వైఫల్యం, అథెరోస్క్లెరోటిక్ హృదయ సంబంధ వ్యాధులు, గుండె వైఫల్యం, అకాల మరణాలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం పేర్కొంది. డయాబెటిస్ ఉన్న వారిలో దాదాపు 40% మందికి కిడ్నీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనం పేర్కొంది. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడంతో పాటు, జీవనశైలిలో మార్పులు కూడా ముఖ్యమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, ఉప్పు వినియోగంపై శ్రద్ధ వహించాలని చెబుతున్నారు. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. ఇది కిడ్నీ వ్యాధికి ప్రధాన కారణమని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రోజుకు 5 గ్రాముల (సుమారు ఒక టీస్పూన్) కంటే తక్కువ ఉప్పు మాత్రమే తీసుకోవాలని అధ్యయనం పేర్కొంది. కానీ, చాలా మంది ప్రాసెస్ చేసిన ఆహారాల ద్వారా తెలియకుండానే ఎక్కువ ఉప్పు తీసుకుంటున్నారని తెలిపింది. ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను కొనేటప్పుడు వాటిలో ఎంత సోడియం ఉందో చూసి, తక్కువ సోడియం ఉన్నవాటిని ఎంచుకోవాలంటు న్నారు నిపుణులు. తాజా పదార్థాలతో ఇంట్లో వంట చేయడం వల్ల ఉప్పు స్థాయిలను మనం నియంత్రించవచ్చని చెబుతున్నారు. తాజా పండ్లు, కూరగాయలు, లీన్ మీట్, తృణధాన్యాలను ఆహారంలో చేర్చుకోవాలని సూచిస్తున్నారు. రుచి కోసం ఉప్పునకు బదులుగా మూలికలు, మసాలా దినుసులను వాడండి. ఈ క్రమంలో ఉప్పు తగ్గించడం వల్ల బీపీ అదుపులో ఉంటుంది. తద్వారా కిడ్నీలపై ఒత్తిడి తగ్గి వ్యాధి తీవ్రత తగ్గుతుందంటున్నారు నిపుణులు.

# ఒత్తైన జుట్టుకు మేలు చేసే 'మందారం'



మన ముంగిట్లో మొక్కలెన్ని ఉన్నా, మందారం ప్రత్యేకం. రకరకాల వర్ణాలు, ఆకృతుల్లో పెద్ద పెద్ద పూలతో నిండుగా విరబూస్తుంది. ఈ క్రమంలో మందారం అనగానే ఒత్తైన కురులే గుర్తుకొస్తాయి. అంతేకాకుండా, ఈ పువ్వులు అందానికి కూడా సాయపడతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మందార పువ్వులు కేశ, చర్మసంరక్షణలో ఎలా సహాయపడతాయో ఇప్పుడు తెలుసుకుందాం! మందార పువ్వులు, ఆకుల్లో అమైనో ఆమ్లాలు, వివిధ రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఇవి కుదుళ్లను బలంగా మార్చి జుట్టు ఎదుగుదలకు ప్రోత్సహిస్తాయని చెబుతున్నారు. అంతేకాకుండా, జుట్టు నిర్జీవంగా కనిపించి నప్పుడు, మందార పూలను మెత్తగా రుబ్బి దానికి కాస్త పెరుగు కలిపి తలకు రాసుకోవాలని సూచిస్తున్నారు. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేస్తే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఇలా చేయడం వల్ల జుట్టు చివర్లు చిట్లకుండా ఉండ టంతో పాటు జుట్టు రాలడమూ తగ్గుతుందంటున్నారు. మందార పువ్వు, ఆకులు చాలా శ్లేష్మం కలిగి ఉంటాయని, ఇది సహజ కండిషనర్‌గా పని చేస్తుందని ప్రచురించింది.

మందార పువ్వుల్ని పేస్ట్ చేసి అందులో కాస్త నిమ్మరసం పిండి, తలకు ప్యాక్ చేసుకోవాలం టున్నారు నిపుణులు. ఈ ప్యాక్ సహజంగా కురులకు తేమను అందించడంతో పాటు చుండ్రునీ తగ్గిస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా, త్వరగా తెల్ల జుట్టు రాకుండా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇందులో ఉండే పోషకాలు యూవీ కిరణాల నుంచి రక్షణ కల్పిస్తుందని తెలియజేస్తున్నారు.మందార పువ్వులు అందానికి కూడా సాయపడతాయంటున్నారు నిపుణులు. పొడిచర్మం ఉన్నవాళ్లు ఈ మిశ్రమాల్ని పూతలా వేసుకుంటే పరిష్కారముంటుందని చెబుతు న్నారు. వీటిల్లో ఉండే ఆల్ఫాహైడ్రాక్సీ ఆమ్లాలు మృతకణాల్ని తొలగిస్తాయని పేర్కొంటున్నారు. దీంతో ప్రకాశవంతమైన చర్మం మీ సొంత మవుతుందని తెలియజేస్తున్నారు. మందారంలో ఫినాలిక్ సమ్మేళనాలు ఉంటాయని, ఇవి చర్మంలోని ఫ్రీ రాడికల్స్‌ను తొలగించడంలో సాయపడతాయని పచురించింది. అంతేకాకుండా, పిగ్మెంటేషన్, నల్లటి మచ్చలతో బాధపడేవారు వీటి మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌?లా వేసుకుంటే చక్కని ఫలితాలు వస్తాయంటున్నారు నిపుణులు. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమల్ని అదుపుచేస్తాయని చెబుతున్నారు.:మందార రేకుల మిశ్రమాన్ని పెరుగు లేదా తేనెను కలపండి. అప్పై ఫేస్‌కి అప్లై చేసుకొని, 15-20 నిమిషాలు తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేస్తే సరిపోతుందంటున్నారు నిపుణులు. లేకపోతే మందార పువ్వుల్ని ఎండలో పెట్టి పొడిలా చేసి వేడినీటిలో కలుపుకొని, అది కాస్త చల్లారక స్ప్రే బాటిల్లోకి వేసుకుని టోనర్‌?లానూ ఉపయోగించవచ్చని తెలియజేస్తున్నారు. అంతే కాకుండా, మందార పువ్వుల్ని ఎండబెట్టి పొడిగా చేసిన తర్వాత.. బాదం, కొబ్బరి నూనెల్లో ఈ పౌడర్‌ని కలిపి ముఖానికి మర్దనా చేసుకోవచ్చని సూచిస్తున్నారు. దీనివల్ల మృదువైన చర్మం మీ సొంతమవుతుందంటున్నారు

# పోలవరం-నల్లమల సాగర్‌పై సుప్రీంకోర్టులో వాదనలు.. విచారణ 12కి వాయిదా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. తెలంగాణ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచనలు ఇచ్చింది. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని కోరింది. ఈ క్రమంలోనే సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వరద జలాలే వాడుకుంటామని చెబుతోందని సింఘ్వీ అన్నారు. కేటాయింపులకు విరుద్ధంగా నీటి వినియోగం సాధ్యపడదని, ఇందుకు సంబంధించి అనేక విషయాలు ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ అని, అక్కడ ప్రాజెక్టులు అన్నీ ఇప్పుడు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పిటిషన్ దాఖలు తర్వాత కేంద్రం కమిటీని నియమించిందని సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు. సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఆంధ్రప్రదేశ్ తరఫున వాదనలు వినిపించారు. ఈ క్రమంలో ముకుల్ మాట్లాడుతూ భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. నా ఇల్లు - నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి అని అడిగారు. నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీస్తుళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి వాదించారు.

తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు స్థానంలో పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం చేపట్టేందుకు రంగం సిద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. ఇలాంటి కొత్త ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం తుది రూపు ఇస్తోందని ఇంతకుముందే వెల్లడించింది. ఇందులో భాగంగా తొలుత బొల్లాపల్లి జలాశయానికి నీళ్లు తీస్తుల్లి అక్కడి నుంచి వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న నల్లమలసాగర్ జలాశయానికి గోదావరి నీళ్లు తరలించాలనే ప్రణాళికను చేసిన సంగతి తెలిసిందే. అవసరమైతే సోమశిలకూ ఈ జలాలు మళ్లిస్తారని సంబంధిత అధికారులు గతంలోనే తెలిపారు. తొలుత ఈ ప్రాజెక్టును చేపట్టి తదుపరి దశలో బనకచర్లకు మళ్లించాలని రాష్ట్ర ప్రభుత్వం దాదాపు తుది అంచనాకు వచ్చింది. అందుకే గత ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి పిలిచిన టెండర్లను జలవనరుల శాఖ తాజాగా రద్దు చేసింది. కొత్తగా పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం పేరుతోనే డీపీఆర్ తయారీకి టెండర్లు పిలవనున్నారు.

# కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన కిడారి



**హుకుంపేట, పతాకం న్యూస్:** హుకుంపేట మండలం సంతరి పంచాయతీ బూరుగుపూట్ గ్రామంలో హెడ్ కానిస్టేబుల్ కూడేలి వెంకటరమణ అనారోగ్యంతో ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వారి సతీమణి కూడేలి కాంతమ్మను రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పరామర్శించి యోగక్షమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే సంతరి గ్రామానికి చెందిన మాజీ కోఉఆపరేటివ్ డైరెక్టర్ టమికే నూకరాజు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని, ఆయనను పరామర్శించారు. వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షంచారు. అనంతరం కొట్నాపల్లి పంచాయతీ మత్యపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొర్ర రాంబాబు అనారోగ్యంతో ఇటీవల స్వర్గస్తులైన నేపథ్యంలో, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. కుటుంబానికి ఎలాంటి సమస్యలు వచ్చినా పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, గూడ సర్పంచ్ కంబిడి జ్ఞానప్రకాష్, మాజీ సర్పంచ్ కొర్ర వాసుదేవరావు, అసెంబ్లీ తెలుగు యువత ఆర్గనైజేషన్ సెక్రటరీ, మండల పీసా కమిటీ అధ్యక్షులు చప్పాలి శంకర్ రావు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు జన్ని వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జి కూడేలి నూకరాజు, టీడీపీ యువ నాయకులు కర్జా అచ్చిబాబు, త్రినాధ్, మురళీ రాజు తదితరులు పాల్గొన్నారు.




# ముగిసిన రెండో రోజు ఆట.. శతకానికి చేరువలో హెడ్



యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ సిడ్నీ వేదికగా ఐదో టెస్టులో తలపడుతున్నాయి. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 34.1 ఓవర్లు ఆడిన ఆస్ట్రేలియా.. 2 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌పై ఇంకా 218 పరుగులు వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆట ముగిసేటప్పటికీ క్రీజులో మిచెల్ నెసర్(1), ట్రావిస్ హెడ్(91) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లల్లో కెప్టెన్ బెన్ స్టోక్స్‌కే రెండు వికెట్లు దక్కాయి. అంతకు ముందు 211/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ బ్యాటర్లు.. 384 పరుగులకు ఆలౌటయ్యారు. జో రూట్(160) అద్భుత శతకంతో రాణించాడు. హ్యారీ బ్రూక్(84) ఆకట్టుకున్నాడు. జెమీ స్మిత్(46) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లంతా స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆసీస్ బౌలర్లలో నెసర్‌కు 4, స్టార్క్, బోలాండ్ తలో రెండు, గ్రీన్, లుబుషేన్ చెరొక వికెట్ పడగొట్టారు.

అనంతరం బ్యాటింగ్‌కి దిగిన ఆసీస్ ఆదిలో కాస్త తడబడింది. చకచకా స్కోరు చేయలేకపోయింది. జాక్ వెదర్లాండ్(21), లుబుషేన్(48)ను స్టోక్స్ స్వల్ప స్కోరుకే వెనక్కి పంపాడు. ట్రావిస్ హెడ్(91లి) శతకానికి చేరువలో ఉన్నాడు.

# టెస్టుల్లో కమ్‌బ్యాక్ ఇచ్చేందుకు గిల్ మాస్టర్ ప్లాన్. కెప్టెన్ డిమాండ్‌కు బీసీసీఐ గ్రీన్ సిగ్నల్!



సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన ఘోర పరాభవం తర్వాత భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అప్రమత్తమయ్యాడు. టెస్టు క్రికెట్‌లో భారత జట్టు మళ్లీ విజయాల బాట పట్టి, మళ్లీ వరల్డ్? టెస్టు ఛాంపియన్?షిప్? ఫైనల్?లో రేసులోకి వచ్చేందుకు ఒక కీలక ప్రతిపాదనను తెరపైకి తెచ్చాడు. ఇకపై ప్రతీ టెస్టు సిరీస్‌కు ముందు కనీసం 15 రోజుల పాటు ప్రాక్టీస్ క్యాంప్?లు నిర్వహించాలని సూచించాడు. జట్టు సన్నద్ధత లోపమే ఓటములకు కారణమని గుర్తించిన గిల్, ఈ మేరకు బీసీసీఐకి సూచించాడు. గిల్ ప్రతిపాదనకు బోర్డు కూడా సానుకూలంగా స్పందించింది. టెస్టు క్రికెట్ ప్లానింగ్‌లో కెప్టెన్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో భారత జట్టు టెస్టుల్లో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. నవంబర్ 2025లో సొంతగడ్డపై జరిగిన సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ చిత్తుగా ఓడింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను సఫారీలు 2-0తో క్లీన్ స్వీప్ చేశారు. అంతకుముందు 2024 చివర్లో న్యూజిలాండ్ చేతిలోనూ భారత్ 3- 0తో వైట్‌వాష్ అయ్యింది. ఇలా ఏడాది వ్యవధిలోనే సొంతగడ్డపై రెండు సార్లు వైట్‌వాష్ అవ్వడం భారత క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ ఓటములే గిల్‌ను ఆలోచనలో పడేశాయి.

గిల్ డిమాండ్ ఏంటి?

గిల్ తన విజన్‌ను స్పష్టంగా సెలెక్టర్లకు, బోర్డుకు వివరించాడు. cటెస్టు సిరీస్ ఆడాలంటే దానికి తగ్గ ప్రాక్టీస్ చాలా అవసరం. ఐదు రోజుల పాటు సాగే టెస్టు ఫార్మాట్ కోసం ఆటగాళ్లు శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉండాలి. అందుకే రెడ్ బాల్ క్రికెట్ కోసం ప్రతీ సిరీస్‌కు ముందు 15 రోజుల క్యాంప్ కచ్చితంగా ఉండాలి. ఈ సమయంలో ఆటగాళ్లు తమ లోపాలను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందిc అని గిల్ తన ఆలోచనను బోర్డుకు సూచించాడు.

కొంతకాలంగా ఎదురవుతున్న ఓటములకు ప్రధాన కారణం సిరీస్‌ల షెడ్యూలే అని గిల్ అభిప్రాయపడ్డాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌కు ముందు భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించింది. అక్కడ వైట్ బాల్ క్రికెట్ (వన్డేలు, టి20లు) ఆడి నేరుగా భారత్ వచ్చింది. ఆసీస్ పర్యటన ముగిసిన తర్వాత, కేవలం నాలుగు రోజుల్లోనే సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు బరిలోకి దిగింది. ఇంత తక్కువ సమయంలో ఒక ఫార్మాట్ నుంచి మరో ఫార్మాట్‌కు మారడం ఆటగాళ్లకు కష్టంగా మారింది. అందుకే ఇకపై షెడ్యూల్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని గిల్ కోరుతున్నాడు.

సీనియర్ల రిటైర్మెంట్ తర్వాత జట్టు పరివర్తన దశలో ఉంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజాలు రిటైర్ అయ్యాక గిల్ పగ్గాలు చేపట్టాడు. ఇప్పుడు జట్టుకు గిల్ నాయకత్వం వహిస్తున్నాడు. అందుకే బీసీసీఐ కూడా అతనికి మద్దతుగా నిలుస్తోంది. కెప్టెన్ అడిగినట్లుగా 15 రోజుల క్యాంప్‌లు ఏర్పాటు చేయడానికి బోర్డు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. cగిల్ ఇప్పుడు చాలా పరిణతితో ఆలోచిస్తున్నాడు. తన విజన్‌ను స్పష్టంగా చెబుతున్నాడు. ఇది భారత క్రికెట్‌కు మంచిదిc అని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు.




# సీన్స్ బాగా రావాలంటే కెమిస్ట్రీ బాగుండాలి: మాళవిక మోహనన్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్లో తెరకెక్కిన ః ది రాజాసాబ్ః సంక్రాంతి కానుకగా ఈ నెల 9న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హారర్ ఫాంటసీ కామెడీ జోనర్‌లో ఈ సినిమా రాబోతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పాటలు, టీజర్, ప్రోమోలు ఇప్పటికే అంచనాలను భారీగా పెంచాయి.

ఈ సినిమాలో ప్రభాస్ సరసన హీరోయిన్లుగా మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కనిపించనున్నారు. సంజయ్ దత్, బొమన్ ఇరానీ, జరీనా వహబ్ వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో ఉన్నారు. తమన్ సంగీతాన్ని అందించారు.

తాజాగా హీరోయిన్ మాళవికా మోహనన్ ఓ ప్రమోషన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... సినిమా షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. నటీనటుల మధ్య సీన్స్ బాగా రావాలంటే మిస్ట్రీ చాలా ముఖ్యం. ప్రభాస్‌తో నాకు చాలా సన్నివేశాలు ఉన్నాయి. నా పాత్రకు నిడివి ఎక్కువ ఉంది. నా సోలో సీన్‌ను పెద్ద స్విమ్మింగ్ పూల్‌లో మూడు రోజులు షూట్ చేశారు. రోజుకు దాదాపు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. మొసలి దాడి చేస్తున్నట్లు నటించాలి. ఒకవైపు చలికి చర్మం మొత్తం మొద్దు బారిపోతోంది. మరోవైపు భయం, ఆందోళన కలిసిన ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వాలి. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ కలిసి ఉన్నాయి. అందులో మూడు రోజులు గడపడం ఒక వింత అనుభవం అంటూ మాళవికా గుర్తు చేసుకున్నారు.

# అనసూయపై రాశి ఫైర్



టాలీవుడ్‌లో మరోసారి ఓ పెద్ద వివాదం దుమారం రేపుతోంది. సీనియర్ నటుడు శివాజీ ఓ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణపై చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. తెలంగాణ మహిళా కమిషన్ కూడా ఆయనకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచింది. ఈ కామెంట్స్‌పై నటి అనసూయ భరద్వాజ్ తీవ్రంగా స్పందించి, మహిళలకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇలాంటి మాటలు సమాజంలో తప్పుడు సందేశం ఇస్తాయని ఘాటుగా కౌంటర్ ఇచ్చింది.

చిన్మయి వంటి మరికొందరు కూడా శివాజీపై ధ్వజమెత్తారు. అయితే కొందరు శివాజీకి సపోర్ట్ చేస్తూ, ఆయన మాటల్లో తప్పేమీ లేదని, సమాజంలో డ్రెస్ సెన్స్ గురించి మాట్లాడడం సహజమని వాదిస్తున్నారు.

ఈ వివాదంలోకి ఇప్పుడు సీనియర్ నటి రాశి కూడా ఎంట్రీ ఇచ్చారు. రాశి మాట్లాడుతూ, శివాజీ తనకు చాలా ఏళ్లుగా తెలుసు, ఆయన చేసిన కామెంట్స్ పూర్తిగా తప్పు కాదు కానీ కొన్ని పదాలు మాత్రం తప్పుగా వచ్చాయని, అందుకు ఆయన సారీ కూడా చెప్పారని అన్నారు. అనసూయపై కౌంటర్ ఇస్తూ, నాలుగేళ్ల క్రితం ఓ షోలో రాశి ఫలాలు అని పలకాల్సిన చోట రాశి గారి ఫలాలు అని అనసూయ చెప్పి నవ్వుకున్నారని, అందులో తన పేరును ఫన్నీగా ఉపయోగించారని పేర్కొన్నారు. మైక్ దొరికింది కదా అని ఏమైనా మాట్లాడకూడదని పేరు చెప్పకుండా అనసూయకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.




# నయనతారపై తమిళ తంబీల ఆగ్రహం



టాలీవుడ్‌లో ఇప్పుడు స్టార్ హీరోయిన్ నయనతార హాట్ టాపిక్ గా మారారు. దాదాపు దశాబ్దం పాటు ఏ సినిమా ప్రమోషన్లకూ వెళ్లకుండా, ఃనో ప్రమోషన్ః పాలసీని గట్టిగా పాటిస్తూ వచ్చిన ఆమె... మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న ఃమన శంకర వరప్రసాద్ గారుః చిత్రం కోసం మాత్రం ఆ నియమాన్ని పక్కనపెట్టారు. దర్శకుడు అనిల్ రావిపూడితో కలిసి న్యూ ఇయర్ స్పెషల్‌గా విడుదల చేసిన ప్రమోషనల్ వీడియోలో నయన్ సరదాగా కనిపించి, స్వయంగా ప్రమోషన్స్ ఏమీ లేవా? అని అడగడం చూసి తమిళ సినీ వర్గాలు షాక్‌లో పడ్డాయి. అనిల్ రావిపూడి ఆశ్చర్యంతో నవ్వుతూ, నయన్ ప్రమోషన్లకు ఒప్పుకోవడమే పెద్ద ప్రమోషన్ అని జోక్ చేశారు. చివర్లో చిరు స్టైల్‌లో డైలాగ్ చెప్పి, సినిమా జనవరి 12న రిలీజ్ అని అనౌన్స్ చేయడం సూపర్ హిట్ అయింది. ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ కూడా కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్లపై నయనతార పాల్గొంటుండటం కోలీవుడ్‌లో మాత్రం పెద్ద చర్చనీయాంశం అయింది. తమిళంలో ఎంత పెద్ద హీరోలతో నటించినా, తన సొంత లేడీ ఓరియెంటెడ్ చిత్రాలకు కూడా ప్రమోషన్లకు రాని నయన్, తెలుగు సినిమా కోసం ఇలా ముందుకు రావడం తమిళ ప్రేక్షకులు, నిర్మాతలు ంచుకోలేకపోతున్నారు. సోషల్ మీడియాలో తమిళ సినిమాలు మీకు టమాటా పచ్చడి లాగా చులకనగా కనిపిస్తున్నాయా? అంటూ ఘాటు ట్రోల్స్, విమర్శలు వెల్లువెత్తాయి. తమిళ నిర్మాతలను ఇబ్బంది పెడుతున్నారని, టాలీవుడ్ పట్ల పక్షపాతం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**